## క్లుప్తంగా

### నేడు నులిపురుగుల మాత్రలు పంపిణీ

పెదకాకాని: నులిపురుగులను పూర్తిగా తొలగించి పిల్లలను ఆరోగ్యవంతులుగా ఉంచేందుకు ఆల్‌బెండజోల్ ఉపయోగపడుతుందని పెదకాకాని వైద్యాధికారి పి.ప్రవీణదీప్తి అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో సోమవారం నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు ఆదివారం తెలిపారు. అంగన్‌వాడీ సెంటర్‌లు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ఉన్న ఏడాది నుంచి 19 సంవత్సరాలు వయస్సు కలిగిన వారందరికీ ఈ నులిపురుగు నివారణ మాత్రలు మింగించడం జరుగుతుందని చెప్పారు. పీహెచ్‌సీ పరిధిలోని 42 అంగన్‌వాడీ కేంద్రాల్లో 616 విద్యార్థులు, 48 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలలో 10,341 మంది, 4 కాలేజీల్లో 4209 మంది విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. సోమవారం హాజరు కాని విద్యార్థులకు 17వ తేదీ మూడవ సోమవారం మింగించడం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్ పుసులూరు శ్రీను పాల్గొన్నారు.

### కనుల పండువగా బ్రహ్మోత్సవాలు



గుంటూరు రూరల్: అమరావతిరోడ్డు గోరంట్లలోని వేంకటేశ్వరస్వామి దివ్య జ్ఞాన తపోవన క్షేత్రంలో నిర్వహిస్తున్న త్రయోవింశతి వార్షిక బ్రహ్మోత్సవాలు కనుల పండువగా నిర్వహిస్తున్నారు. ఆదివారం కార్యక్రమాల్లో భాగంగా ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. అనంతరం స్వామి కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం గోపూజ కార్యక్రమం, చిన్న పిల్లల నాటక ప్రదర్శన, కోలాటం భక్తులను అలరించాయి. కార్యక్రమంలో ఉండవల్లి శ్రీదేవి, దేవస్థానం చైర్మన్ కంచెర్ల ఆంజనేయులు, అధ్యక్షులు యర్రంశెట్టి వేణుగోపాల్, శివన్నారాయణ, ఆంజనేయులు, సురేష్ పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

చేబ్రోలు: రెండు బైక్‌లు ఢీ కొన్న ఘటనలో మహిళ గాయపడిన ఘటన మండల కేంద్రమైన చేబ్రోలులో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. ఏలూరు ప్రాంతానికి చెందిన తుమ్మలపూడి వెంకట లక్ష్మి దంపతులు బైక్‌పై చేబ్రోలు మండలం మంచాలలో నిర్వహిస్తున్న దేవరమ్మ కొలుపులకు హాజరయ్యేందుకు వస్తున్నారు. చేబ్రోలు కొమ్మమూరు చానల్ వద్ద ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో వెంకట లక్ష్మి తలకు గాయమైంది. బాధితురాలిని 108లో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### వైభవంగా వీరమ్మ పేరంటాళ్ల అమ్మవారి గ్రామోత్సవం



పెదకాకాని: వీరమ్మ పేరంటాళ్ల అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. తిరునాళ్లలో భాగంగా శుక్రవారం సాయంత్రం అమ్మవారు ఆలయం నుంచి ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై బయలుదేరి తక్కెళ్లపాడు చేరుకున్నారు. గ్రామోత్సవం అనంతరం తిరిగి శనివారం అగతవరప్పాడులో గ్రామోత్సవం జరిగింది. శనివారం రాత్రికి వెనిగండ్ల చేరుకున్న అమ్మవారు ఆదివారం వీధులలో కొమ్ము వాయిద్యాలు, డప్పుల మోత నడుమ గ్రామోత్సవం అనంతరం రాత్రికి పెదకాకాని చేరుకునుంది. గ్రామోత్సవంలో భక్తులు వీరమ్మ పేరంటాళ్ల అమ్మవారికి పూలు, పండ్లు, కొబ్బరికాయలు, పసుపు కుంకుమలు సమర్పించి భక్తిని చాటుకున్నారు. రైతులు పొలంలో విరగ్గాసిన మిరప చెట్లను ట్రాక్టర్‌కు అలంకరించారు. రెండు రోజుల పాటు పెదకాకానిలో గ్రామోత్సవం అనంతరం ఈనెల 13వ తేదీన పెదకాకాని వీరమ్మ పేరంటాళ్ల అమ్మవారి తిరునాళ్ల, సిడిమాను ప్రదర్శన ఘనంగా నిర్వహించనున్నట్లు ఈఓ కృష్ణంరాజు తెలిపారు.

### 19న వాహనాల వేలం

పట్నంబజారు: పన్నులు చెల్లించకుండా రవాణాశాఖ దాడుల్లో పట్టుపడిన వాహనాలకు ఈ నెల 19వ తేదీన వేలం నిర్వహించనున్నట్లు డీటీసీ కె. సీతారామిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు ఆర్టీఏ కార్యాలయంలో ఉన్న 31 వాహనాలకు సంబంధించి ఎల్‌జీవీలు, మోటార్ సైకిల్స్, మోటార్‌కార్, మ్యాక్సీక్యాబ్లు వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత వాహనదారులు పన్నులు, కట్టాల్సిన అపరాధ రుసుం చెల్లించి ఫిబ్రవరి 18వ తేదీలోగా వాహనాలను విడిపించుకోవాలని లేని పక్షంలో 19వ తేదీన వేలంపాట నిర్వహించటం జరుగుతుందని తెలిపారు. 19వ తేదీ మధ్యాహ్నం 2గంటలకు స్వర్ణభారతినగర్‌లోని ఆర్టీఓ కార్యాలయంలో వేలం జరుగుతుందని వివరించారు.

# ఖాళీగా దుకాణాలు.. రోడ్లపై వ్యాపారాలు

- నిరుపయోగంగా మున్సిపల్ దుకాణాలు
- ఆదాయం కోల్పోతున్న పొన్నూరు మున్సిపాలిటీ



రోడ్డుపైనే కూరగాయలు అమ్ముతున్న వ్యాపారులు

పొన్నూరు: వ్యాపార కేంద్రంగా ఉన్న పొన్నూరు పురపాలక సంఘ పరిధిలో రోడ్లు వ్యాపార కూడళ్లుగా మారిపోయాయి. చిరు వ్యాపారులకు మున్సిపల్ దుకాణాలు అందుబాటులో లేకపోవడంతో చిన్నపాటి వ్యాపారాలు రహదారుల పక్కన ఏర్పాటు చేసుకుంటున్నారు. రోడ్లపైనే కూరగాయలు, పూలు, పండ్లు, చేపలు విక్రయించి జీవనం సాగిస్తున్నారు. పట్టణ ప్రగతికి ఆదాయాన్ని సమకూర్చే మున్సిపల్ దుకాణాలు మాత్రం పదుల సంఖ్యలో ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

**వ్యాపారుల అవస్థలు**

రూ.వేలల్లో అద్దెలు.. లక్షల్లో డిపాజిట్లు.. కేటాయింపులకు టెండర్లు.. ఆశించిన అద్దె రాకపోతే టెండరు రద్దు చేయడం వంటి విధానాలతో పట్టణంలోని కొన్ని మున్సిపల్ దుకాణాలు ఏళ్ల తరబడి ఖాళీగా ఉంటున్నాయి. ఏదైనా వ్యాపారం పెట్టుకుని జీవనం సాగిద్దామనుకునే చిరు వ్యాపారులకు వాటిని అద్దె రూపంలో దక్కించుకోవడం చాలా కష్టమైన పనిగా మారింది. కష్టాన్ని నమ్ముకుని జీవించే వారికి మున్సిపల్ దుకాణాల్లో వ్యాపారం నిర్వహించడం సాధ్యపడటం లేదు. దీంతో అటు అద్దెల రూపంలో పొన్నూరు మున్సిపాలిటీ ఏటా రూ.లక్షల్లో ఆదాయం కోల్పోతోంది. చిరు వ్యాపారులు రోడ్లకే పరిమితమవుతున్నారు. నిబంధనలను సడలించి ఖాళీగా ఉన్న దుకాణాలను అద్దెలకు కేటాయించి ఆదాయాన్ని పెంచుకునే దిశగా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి..

- పట్టణంలో ప్రధాన వ్యాపార కూడలిగా ఉన్న ఐలాండ్ సెంటర్ చిరు వ్యాపారులకు జీవనాధారంగా మారింది. సమీపంలోనే మున్సిపల్ కాంప్లెక్స్‌లు ఉన్నాయి. వాటిలోనే కూరగాయల మార్కెట్, మటన్ మార్కెట్‌లు కూడా ఉన్నాయి. వాటి ద్వారా మున్సిపాలిటీకి ఏటా రూ.లక్షల్లో ఆదాయం సమకూరుతుంది. అయితే టెండర్ నిబంధనలకు ఇష్టపడి, ఆర్థికంగా వెసులుబాటు ఉన్న కొందరు వ్యాపారులు మాత్రమే వాటిని దక్కించుకుంటున్నారు. సామాన్యులకు కష్టతరంగా మారాంది. ఖాళీగా ఉన్న దుకాణాలతో అద్దెలు నష్టపోవడమే కాక, వినియోగానికి నోచుకోక దుకాణ భవనాలు శిథిలమవుతున్నాయి.



ఖాళీగా ఉన్న కూరగాయల మార్కెట్ దుకాణాలు

- ఐలాండ్ సెంటర్‌లో కాలిబాటపై పూలు, కూరగాయలు, పండ్లు దుకాణాలు నిర్వహిస్తున్నారు. ఈ కారణంగా ఉదయం, సాయంత్రం సమయాల్లో ఆ దారులు కొనుగోలుదారులతో నిండిపోతున్నాయి. వాహనాలను రోడ్డుపైనే ఉంచి పూలు, పండ్లు కొనేందుకు రావడంతో వాహనాలు ఎక్కడిక్కడ నిలిచిపోతున్నాయి. ఫలితంగా వాహనచోదకులు ట్రాఫిక్‌లోనే ఇరుక్కుపోతున్నారు. నిత్యం ఇదే తంతు సాగుతున్నా పరిస్థితిని చక్కదిద్దే వారే కనిపించడం లేదు. కూరగాయల అమ్మకాల కోసం మార్కెట్లో ఉన్న దుకాణాల్లోనే అమ్మకాలు చేపట్టేలా చర్యలు తీసుకుంటే ట్రాఫిక్ ఇబ్బందులు పూర్తిగా తీరతాయి. దీని వల్ల మార్కెట్ పరిసరాలు సైతం అభివృద్ధికి నోచుకుంటాయి. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.కూరగాయల మార్కెట్‌లో ప్రస్తుతం 12 దుకాణాలు ఖాళీగా ఉన్నాయని మున్సిపల్ ఆర్ఓ టి.వెంకటేశ్వరరావు తెలిపారు.

## భూముల క్రమబద్ధీకరణకు దరఖాస్తుల ఆహ్వానం

పొన్నూరు: మండలంలో అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ చేసుకునే పథకానికి సంబంధించి మీ సేవ కేంద్రాలు, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దారు మహమ్మద్ జియావుల్‌హక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2019 అక్టోబరు 15వ తేదీ కంటే ముందు ఆక్రమణలలో ఉన్న భూములను నిబంధనలు అనుసరించి క్రమబద్ధీకరించనున్నట్లు పేర్కొన్నారు. 150 గజాల వరకు ఉచితమని, రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. దారిద్రరేఖకు దిగువన ఉండి 151 నుంచి 300 గజాల లోపు ఆక్రమణలకు బేసిక్ ధరలో 15 శాతం, రిజిస్ట్రేషన్ ఫీజులో 50 శాతం చెల్లించాలని అన్నారు. 300 నుంచి 450 గజాల పరిధిలో బీపీఎల్ కుటుంబాల వారు వందశాతం బేసిక్ ధర, 50 శాతం రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలన్నారు. ఇదే విభాగంలో బీపీఎల్‌కు ఎగువన ఉన్న వారు 200 శాతం బేసిక్ ధర, పూర్తి రిజిస్ట్రేషన్ ఫీజు కట్టాల్సి ఉంటుందని, 450 గజాలకు మించిన ఆక్రమణలో ఎవరు ఉన్నప్పటికీ బేసిక్ ధరకు ఐదు రెట్లు, వందశాతం రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలని పేర్కొన్నారు. లబ్ధిదారులు, కుటుంబ సభ్యులు ఐటీ చెల్లింపుదారులై ఉండకూడదని, నాలుగు చక్రాలు వాహనం ఉండకూడదని స్పష్టం చేశారు. గ్రామాల్లో నెలకు రూ.10 వేలు, పట్టణాల్లో నెలకు రూ.14 వేలు ఆదాయం ఉన్నవారు దీనికి అర్హులుగా నిర్ణయించగా, నెలకు రూ.300లోపు విద్యుత్తు ఛార్జీల చెల్లింపు ఉండాలన్నారు. మెట్ట, మాగాణి కింద కలిపి పది ఎకరాలకు మించకూడదని వెల్లడించారు. ఆస్తిపన్ను చెల్లింపు, విద్యుత్తు బిల్లు, వాటర్ బిల్లులను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. అర్హులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దారు జియావుల్ హక్ కోరారు.

## క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి




మాట్లాడుతున్న డాక్టర్ రాజు నాయుడు

లక్ష్మీపురం: క్యాన్సర్ వచ్చిన కాపాడే బతికించడంతో వారి జీవితకాలం కొంత పొడిగించగలిగే స్థితికి ప్రస్తుతం వైద్య విధానాలు అందుబాటులోకి వచ్చాయని ప్రముఖ క్యాన్సర్ వ్యాధి నిపుణులు రాజు నాయుడు తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆరోగ్య సభ ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైద్యం అందుబాటులోకి వచ్చినా అప్రమత్తంగా ఉండకపోతే కష్టమని పేర్కొన్నారు. కొన్ని రకాల క్యాన్సర్‌కు వ్యాక్సిన్ అందుబాటులో ఉన్నాయని చెప్పారు. గర్భసంచి వ్యాక్సిన్ ఆడపిల్లలకు 9 నుంచి 14 సంవత్సరాల లోపు చేస్తే మంచిదన్నారు. ప్రతి ఒక్కరూ 40 సంవత్సరాల వయస్సు దాటితే, సంవత్సరానికి ఒక్కసారి ఈ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని, ఒకవేళ వారి కుటుంబంలో ముందుతరాల వారికి ఎవరైనా క్యాన్సర్ బారిన పడిన వారు ఉంటే, అలాంటి వారు 30 ఏళ్ల పైబడిన తర్వాత నుంచే సంవత్సరానికి ఒక్కసారి స్క్రీనింగ్ చేయిస్తే మంచిదన్నారు. అనంతరం డాక్టర్ రాజు నాయుడును ఘనంగా సత్కరించారు. సమావేశానికి టీవీ సాయిరాం కోఆర్డినేటర్ గా వ్యవహరించగా, అవగాహన సంస్థ సీనియర్ సభ్యులు ఎస్.విద్యాధర కుమార్, టెలికాం శాఖ విశ్రాంత అధికారి బి.సాంబశివరావు, ఎ.హరి, చల్లా అంజిరెడ్డి, ఆర్.రామచంద్రరావు పాల్గొన్నారు.

# గంజాయి రవాణా చేసే వ్యక్తుల అరెస్ట్



పోలీసుస్టేషన్‌లో గంజాయి అమ్మకాలు చేస్తున్న నిందితులతో సీఐ నారాయణస్వామి

పెదకాకాని: గంజాయి తరలించి అమ్ముతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్న ఘటన చోటుచేసుకుంది. వివవరాలు.. మంగళగిరి మండలం కాజ గ్రామానికి చెందిన గంజి బోయిన శశాంక్ అలియాస్ శశి, మంగళగిరి పట్టణానికి చెందిన పెరుగు అనిల్ కుమార్ అలియాస్ పెరుగు గత నాలుగు సంవత్సరాలుగా విశాఖపట్నం వెళ్లి అక్కడ అర్జున్ అనే వ్యక్తిని కలసి అతడి వద్ద గంజాయి కొనుగోలు చేసేవారు. కొనుగోలు చేసిన గంజాయిని మంగళగిరి తీసుకొచ్చి చిన్న చిన్న పాలిథిన్ కవర్లలో ప్యాకెట్లుగా చేసి చుట్టుపక్కల గ్రామాలైన కాజ, మంగళగిరి, పెదకాకాని, ఉప్పలపాడు తదితర గ్రామాల్లో ఉన్న గంజాయి తాగేవారికి అమ్మి డబ్బులు సంపాదిస్తున్నారు. ఎప్పటి మాదిరిగానే పెదకాకాని గ్రామ శివారులో గంజాయి అమ్మేందుకు శనివారం రాత్రి చేరుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న పోలీసులు గంజిబోయిన శశాంక్, పెరుగు అనిల్‌కుమార్‌లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి మూడు కిలోలు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను ఆదివారం అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరచినట్లు పెదకాకాని సీఐ టీపీ నారాయణస్వామి తెలిపారు. నిందితులకు రిమాండ్ విధించినట్లు చెప్పారు.

**డీజిల్ చోరీ దొంగల అరెస్టు**

పెదకాకాని: జాతీయ రహదారిపై ఆగిఉన్న వాహనాల నుంచి డీజిల్ చోరీ చేస్తున్న నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అమరావతి మండలం మునుగోడు గ్రామానికి చెందిన సాధనాల విజయ్‌కుమార్, కొల్లికొండ వెంకటరావు, అబ్బినేని వెంకటనరసయ్య అలియాస్ నాని గత కొంతకాలంగా హైవేపై ఉన్న వాహనాల నుంచి డీజల్ దొంగిలిస్తున్నారు. డీజల్ దొంగలపై నిఘా పెట్టిన పోలీసులు ముందస్తు సమాచారం మేరకు పల్లాలమ్మ చెరువు వద్ద ఆగి ఉన్న లారీ ఆయిల్ ట్యాంక్ తాళాలు పగులగొట్టి ఆయిల్ బయటకు తీస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి రూ.5800 విలువ చేసే డీజిల్, షిఫ్ట్ డిజైర్ కారును రికవరీ చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు సీఐ టీపీ నారాయణస్వామి వెల్లడించారు.

### ముగిసిన కాసరనేని కళా సమితి నాటకోత్సవాలు



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం ఆవరణలోని అన్నమయ్య కళా వేదికపై కె.ఆర్.కె. ఈవెంట్స్ నిర్వహణలో నిర్వహిస్తున్న డాక్టర్ కాసరనేని సదాశివరావు కళాసమితి 13వ నాటకోత్సవాలు ఆదివారం ముగిశాయి. తొలుత ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు లంకా విజయబాబు, సహాయ కార్యదర్శి ఊటుకూరు నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో నాటకోత్సవాలను ప్రారంభించారు. ఎల్‌వీఆర్ క్రియేషన్స్(గుంటూరు) ఆధ్వర్యంలో బత్తినేని సుభాష్ రచన దర్శకత్వం వహించిన హాస్యవల్లరి నవ్వుల్తో ముంచెత్తింది. హేలాపురి కల్చరల్ అసోసియేషన్(ఏలూరు) ఆధ్వర్యంలో చింతల మల్లేశ్వరరావు రచనకు మహమ్మద్ ఖాజావలి దర్శకత్వం వహించిన సారీ... రాంగ్ నెంబర్ నాటికను, శ్రీకరణం సురేష్ మెమోరియల్ థియేటర్స్ (గుంటూరు) ఆధ్వర్యంలో బొమ్మిడి రామకృష్ణ రచన, దర్శకత్వం వహించిన తర మెల్లిపోతున్నదో నాటికలు ప్రదర్శించారు.

## డాక్టర్ విజయకుమార్‌కు గోల్డ్ మెడల్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ సుందరాచారి, పక్కన డాక్టర్ రమణ తదితరులు

గుంటూరు మెడికల్: మూడు దశాబ్దాల క్రితం గుంటూరు నగరంలో మధుమేహ వ్యాధి ఆస్పత్రిని స్థాపించి వేలాది మందికి వైద్య సేవలు డాక్టర్ వీవీ రామ్‌కుమార్ అందిస్తున్నారని గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగార్జునకొండ వెంకట సుందరాచారి పేర్కొన్నారు. మధుమేహ వైద్యంలో విశేష సేవలందిస్తున్న డాక్టర్ జి.విజయ్ కుమార్‌కు వి.శేషయ్య గోల్డ్ మెడల్‌ను ఆదివారం అందించి, సత్కరించారు. స్థానిక రాజేంద్రనగర్ హోటల్ క్యాపిటల్‌లో ఎస్వీఆర్ షుగర్ హాస్పిటల్, డాక్టర్ వీవీ రామ్ కుమార్ డయాబెటిస్ అకాడమీ అండ్ స్మైల్ డయాబెటిస్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన షుగర్ వ్యాధి నిపుణులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి, గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ ముఖ్య అతిథులుగా హాజరై సదస్సును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ మాట్లాడుతూ డాక్టర్ రామ్‌కుమార్ ప్రముఖ షుగర్ వ్యాధి నిపుణులు గానే కాకుండా నగరంలోని వైద్యులందరికీ తన లాఫ్టర్ క్లబ్ ద్వారా నెల నెల హాస్య కార్యక్రమాలతో మానసిక ఆనందాన్ని, ఆహ్లాదాన్ని పంచుతున్నారని అభినందించారు. డాక్టర్ వి.వి.రామ్ కుమార్ మాట్లాడుతూ షుగర్ వ్యాధిపై వివిధ అంశాల ద్వారా వివిధ రాష్ట్రాల నుంచి అంతర్జాతీయ వైద్యులు వర్క్‌షాప్ ద్వారా సీనియర్, జూనియర్ డాక్టర్లకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా దిశా నిర్దేశం చేశారని తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ వి.కమలా రామ్ కుమార్, భవతరణి పాల్గొన్నారు.

### బైక్‌లతో యువకుల హంగామా



పట్నంబజారు: గుంటూరు నగరంలో మరో సారి యువకులు హల్‌చల్ చేశారు. బైక్‌లపై విన్యాసాలు చేస్తూ.. భారీగా శబ్దాలతో కూడిన హారన్‌లు కొడుతూ.. హడావుడి చేశారు. భారీ హారన్‌లు, స్నేక్ డ్రైవ్‌లతో బీభత్సం చేయటంతో వాహనదారులతో పాటు, పాదచారులు భయాందోళనలకు గురైన పరిస్థితులు ఉన్నాయి. గుంటూరు అరండల్‌పేట, పట్టాభిపురం, వెస్ట్ ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలో కళాశాలలు అధికంగా ఉన్న విషయం విదితమే. ఈ క్రమంలో నిత్యం సాయంత్రం వేళల్లో ప్రమాదకర డ్రైవింగ్ చేస్తూనే ఉన్నారు. త్రిపుల్ రైడింగ్‌తో ఆదివారం సాయంత్రం జరిగిన హడావుడికి ప్రజలు భయభ్రాంతులు అయ్యారు. లక్ష్మీపురం ప్రధాన రహదారి, కొరిటెపాడు మెయిన్ రోడ్డులో సుమారు 15 బైక్‌లతో త్రిపుల్ రైడింగ్ చేస్తూ.. ర్యాష్, అండ్ స్నేక్ డ్రైవ్ చేశారు. నిత్యం కేసులు నమోదు చేస్తున్నామని అధికారులు చెప్పినా ఎటువంటి ప్రయోజనం కనపడటంలేదు. అసలు స్పెషల్ డ్రైవ్‌లు ఊసే లేదని, మైనర్‌లు వాహనాలు నడుపుతున్నా.. కట్టడి చేయటంతో ట్రాఫిక్ పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. ఇప్పటికైనా దృష్టి సారించి ర్యాష్ అండ్ స్నేక్ డ్రైవ్‌ను అరికట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.

### ఇది పార్కే నమ్మండి!





నగర శివారు 48వ డివిజన్ రెడ్డిపాలెం డివిజన్‌లోని మహాత్మాగాంధీ ఇన్నర్‌రింగ్ రోడ్డులోని పార్క్ అధ్వానంగా మారింది. ఎక్సర్‌సైజ్‌లు చేసే వస్తువులు, చిన్నపిల్లల ఆటవస్తువులు అన్ని మరమ్మతులకు గురై ఎందుకు పనికిరాకుండా పోయాయి. వాకింగ్ ట్రాక్ సైతం విరిగిపోయి, కనీసం నడిచేందుకు కూడా వీలులేకుండా పోయింది. అధికారులు స్పందించి పార్క్‌లో మౌలిక వసతులు కల్పించాలని, వాకర్స్ స్థానిక ప్రజలు కోరుతున్నారు.

– గుంటూరు రూరల్

## అనధికార మాంసం విక్రయాలు జరిపితే చర్యలు



నెహ్రూనగర్: ప్రజారోగ్యం దృష్ట్యా నగరంలో అనధికార చేపలు, మాంసం విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎంహెచ్‌ఓ డాక్టర్ రవిబాబుహెచ్చరించారు. ఆదివారం కమిషనర్ ఆదేశాల మేరకు నగర పాలక సంస్థ ప్రజారోగ్య అధికారులు బృందాలుగా ఏర్పడి నగరంలోని మణిపురం బ్రిడ్జ్ క్రింద చేపల మార్కెట్, నల్లపాడు రోడ్డు, రెడ్డి కాలేజీ రోడ్డు, మిర్చియార్డ్, నవభారత నగర్, గోరంట్ల, ఆర్.టి.ఓ. ఆఫీసు, గుజ్జనగుండ్ల, అమరావతి రోడ్డు, పొన్నూరు రోడ్డు, పట్టాభిపురం ప్రాంతాలలో రోడ్లపై అనధికారికంగా చేపలు, మాంసం విక్రయిస్తున్న వారిని గుర్తించి వారిపై దాడులు నిర్వహించి వాటిని తొలగించి, వారి వద్ద నుంచి అపరాధ రుసుం వసూలు చేశారు. ఈ సందర్భంగా ఎంహెచ్ డాక్టర్ రవిబాబు మాట్లాడుతూ నగర పరిధిలో ఎక్కడైనా అనధికారికంగా నాటుకోళ్లు, చేపలు, మాంసం విక్రయాలు జరిపై వారిపై కఠిన చర్యలు, భారీ మొత్తంలో అపరాధ రుసుం విధించడమే కాకుండా వారిపై చట్టప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లైసెన్స్ పొంది మాంసం విక్రయించే షాపుల యజమానులు తమ షాపు చుట్టు పక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మాంసంపై దూమ్ము, ధూళి పడకుండా మెస్‌లను కట్టి ఎప్పటికప్పుడు శుభ్రత పాటించాలని వివరించారు. శుభ్రత పాటించని షాపులపై ఎప్పటికప్పుడు దాడులు నిర్వహించి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పశు వైద్యుడు వెంకటేశ్వర్లు, ఎస్ఎస్‌లు ఆనందకుమార్, సోమశేఖర్, రాంబాబు, ఆయూబ్ ఖాన్ పాల్గొన్నారు.

### దక్షిణ భారత హిందీ ప్రచారసభ పరీక్షలు

గుంటూరు ఎడ్యుకేషన్: సీతారామ్‌నగర్‌లోని శ్రీసరస్వతీ కమిటీ ఎయిడెడ్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఆదివారం దక్షిణ భారత హిందీ ప్రచారసభ ఆధ్వర్యంలో పరిచయ, ప్రాథమిక, మాధ్యమ పరీక్షలను నిర్వహించారు. 56 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు పాఠశాల కరస్పాండెంట్ డీవీ సుబ్బారావు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మానసవీణ చీఫ్ సూపరింటెండెంట్‌గా వ్యవహరించగా, ఉపాధ్యాయులు అరుణకుమారి, నాగమేరీ, విజయలక్ష్మి ఇన్విజిలేటర్లుగా వ్యవహరించారు.

## భారతీయ సంస్కృతి, సంప్రదాయ కళలను ప్రోత్సహించాలి




కళాకారులతో నిర్వాహకులు

నగరంపాలెం: స్థానిక మార్కెట్ కూడలిలోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో శ్రీ మంజునాథ నాట్య క్షేత్రం ఆధ్వర్యంలో ఆదివారం జాతీయ స్థాయి నృత్య సంగీతం, కళా ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఒక వేదికపై పలువురు నృత్యాల ప్రదర్శన అట్టహాసంగా జరిగాయి. కొందరు చిన్నారుల నృత్యాలు సభికులను అలరించాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన మలినేని కళాశాల చైర్మన్ మలినేని పెరుమాళ్లు మాట్లాడుతూ దేశ సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేసే నృత్యాలే మన భారతీయమని అన్నారు. కళ జీవించాలంటే అందరి ప్రోత్సాహం అవసరమని చెప్పారు. కళాకారుడు కావడం చాలా కష్టమని, కళాకారునిగా జన్మించడం అదృష్టమని పేర్కొన్నారు. భారతీయ సంస్కృతిక, సంప్రదాయ, కళలను ప్రోత్సహిస్తూ, జీవం పోస్తున్న రాజుపాలెం మనోజ్ఞ, ప్రదీప్‌లను అభినందించారు. నృత్య ప్రదర్శనలు చేసి, ఉత్తమ నైపుణ్యం ప్రదర్శించిన కళాకారులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ టి.పవన్ కుమార్, జంపని కిషోర్‌బాబు, డాక్టర్ డి.నాగమల్లీశ్వరి, విజయమాధవి, డాక్టర్ ఆకుల శివప్రసాద్, డాక్టర్ ఎస్.అనిత పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ దంతాలపై శ్రద్ధ పెట్టాలి

గుంటూరు మెడికల్: నోరు అనేక రకాల హానికర సూక్ష్మజీవులకు నిలయమని నోరు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోకపోతే, నోటి దుర్వాసన ,పుండ్లు పడడం, చిగుళ్ల వాపు, దంతాలు ఊడటం వంటి సమస్యలు తలెత్తుతాయని కాస్మోడెంట్స్ దంత వైద్యశాల దంత శస్త్ర చికిత్స నిపుణులు చల్లా చైతన్య పేర్కొన్నారు. ఆదివారం స్థానిక బ్రాడీపేట లోని ఎస్ హెచ్ ఓ భవనంలో ఎస్ హెచ్ ఓ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా నిర్వహించిన 'ఉచిత దంత వైద్య శిబిరం, శాస్త్రీయ అవగాహన సభ 'లో డాక్టర్ చైతన్య పాల్గొని ప్రసంగించారు. సభకు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మెడికల్ క్యాంప్స్ చైర్మన్ టి.ధనుంజయ రెడ్డి అధ్యక్షత వహించారు. డాక్టర్ చైతన్య మాట్లాడుతూ వయసు పెరిగిన కొద్దీ వయసుతో పాటే పళ్ళు ఊడిపోతాయనే భావన చాలామందిలో ఉందని, అయితే తగిన ముందు జాగ్రత్తలు తీసుకుంటే వయసుతోపాటు పళ్ల ఊడడాన్ని నిరోధించవచ్చునన్నారు. నోటిలో దాదాపు 200 నుంచి 300 రకాల సూక్ష్మ జీవులు 10 మిలియన్ల దాకా ఉంటాయన్నారు. వైద్య శిబిరంలో ఎస్‌హెచ్‌ఓ మేనేజర్ పి.నిర్మలరాణి, మేకల రామారావు, చావా శివాజీ పాల్గొన్నారు.

## కనుల పండువగా స్వామి వార్ల కల్యాణోత్సవం



నగరంపాలెం: స్థానిక బ్రాడీపేట 2/13వ అడ్డరోడ్డు ఓంకార క్షేత్రం కుర్తాళం శ్రీసిద్ధేశ్వరీ పీఠపాలిత ఓంకార క్షేత్రంలో నిర్వస్తున్న 91వ శ్రీరామనామ సప్తాహ మహోత్సవం- 95వ సంఘ వార్షికోత్సవాలలో భాగంగా ఆదివారం ఏడో రోజుకి చేరాయి. ఉదయం క్షేత్రపాలక ఆంజనేయస్వామికి మృత్యుంజయ సహిత ఆదిత్యాది నవగ్రహ దేవతలకు వేదోక్తంగా అభిషేకార్చనలు నిర్వహించారు. గోదాదేవి సమేత రంగనాయకస్వామి వార్లకు, సువర్చలా సమేత ఆంజనేయస్వామి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ముత్యాల తలంబ్రాలు విశేష హారతి, మంత్రపుష్పం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు.